నేడు రథసప్తమి వేడుకలు


బొమ్మూరు సూర్యమందిరంలో సూర్యనారాయణస్వామి


అలయ ఆవరణలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లు

- బొమ్మూరు సూర్యమందిరంలో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు
- భక్తులకు వసతుల కల్పన

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు గ్రామంలోని వివేకానంద మహారోగి ఆరోగ్యకేంద్రంలో ఉన్న సూర్యమందిరంలో శుక్రవారం రథసప్తమి వేడుకలు, సూర్యనారాయణమూర్తి జయంతి అత్యంత వైభవంగా జరగనున్నాయి. రాజవోలు గాయత్రీ నగర్‌కు చెందిన చిట్టెళ్ల కాశీపతి సోమనాథ శర్మ, పద్మావతి దంపతులు పీటలపై కూర్చుని గణపతిపూజ, పుణ్యావచనం, నవగ్రహ ఆరాధన, సూర్యహోమం, సూర్యనమస్కారాలు, సూర్యనారాయణస్వామి కల్యాణం (శాంతి కల్యాణం) నిర్వహిస్తారు. జ్యోతిర్లింగార్చనతో రథసప్తమి వేడుకలు ముగుస్తాయి. ఆలయ అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ నేతృత్వంలో టీటీడీ వార్షిక సత్కార పండిట్ ప్రతిష్టాచార్య బ్రహ్మశ్రీ కాళ్లకూరి సూర్యశ్రీ ఆధ్వర్యంలో విల్లూరి సూర్యనారాయణ శర్మ, కాళ్లకూరి శ్రీరామ శర్మ అర్చక బృందం బ్రహ్మత్వం నిర్వహించనున్నారు.

1998లో ప్రారంభం

మహారోగి ఆరోగ్య కేంద్రంలో ఆధ్యాత్మిక ఆర్తిని తీర్చడం కోసం, వారిలో భక్తి భావనలు పెంపొందించడం కోసం 1998లో సూర్యదేవాలయాన్ని నిర్మించారు. చిన జీయర్‌స్వామి ప్రతిష్ఠించిన ఈ దేవాలయానికి ప్రతి రథసప్తమి వేడుకలకు బొమ్మూరుతో పాటు పరిసర గ్రామాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. కేంద్ర వాసులందరూ సూర్యభగవానుడిని ప్రత్యక్ష దైవంగా కొలుస్తారు. భారత మాత వారి ఇలవేల్పు వివేకానంద గోనిలయం పేరున 30 గోవులతో గోశాలను సైతం నిర్వహిస్తున్నారు.

క్యూలైన్ల ఏర్పాట్లు

రథసప్తమి సందర్భంగా సూర్యమందిరానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆరోగ్యకేంద్రం కమిటీ అధ్యక్షుడు ఓలేటి సత్యనారాయణ, కమిటీ సభ్యులు చర్యలు చేపట్టారు. ఆలయ ఆవరణలో క్యూలైన్లు తదితర వాటిని ఏర్పాటు చేశారు.

ప్రత్యేక పూజలు

సూర్యనారాయణస్వామికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు కాళ్లకూరి సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో గణపతిపూజ, పుణ్యాహవచనం, 121 సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అధిక సంఖ్యలో దంపతులు పాల్గొన్నారు.

నేటి నుంచి చందన యాత్ర మహోత్సవాలు

సీటీఆర్‌ఐ: స్థానిక కోరుకొండ రోడ్డులోని సింహాచల నగర్ వరహాలక్ష్మీ నృసింహస్వామి క్షేత్రంలో మధుభయ వేదాన్తాచార్య పీఠం ట్రస్టు, శ్రీరంగం ఆధ్వర్యాన శుక్రవారం నుంచి ఈనెల 21 వరకూ 22వ వార్షిక చందన యాత్ర మహోత్సవాలు నిర్వహించడానికి ఆలయ ధర్మకర్తలు కాలెపు సూర్య సింహాచలం, కాలెపు నాగేశ్వర రావు పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అర్చకులు అవసరాల శ్రీకిరణ్ స్వామి వివరాలు వెల్లడించారు. ఆ ప్రకారం .. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ఉత్సవ ప్రార్థన, విష్వక్సేన పూజ, రుత్విక్ వరుణం, రక్షా సూత్రం, అంకురార్పణ, వైనతేయ ప్రతిష్ఠ జరుగుతాయి. శనివారం ఉదయం సంతాన సాఫల్యం కోసం గరుడ ప్రసాద వితరణ, సాయంత్రం 4 గంటలకు తిరువీధి (గరుడ సేవ) ఉత్సవం ఉంటుంది. ఆదివారం ఉదయం ఆరాధన, హోమాలు, సాయంత్రం ఎదురు సన్నాహం, తిరుకల్యాణ మహోత్సవం, మూర్తి కలశారాధన నిర్వహిస్తారన్నారు. 19వ తేదీ ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ నిజరూప దర్శన సేవ, రాత్రి 8 గంటలకు అష్టోత్తర శత కలశాభిషేకం, 9 గంటలకు చందన సమర్పణ, తీర్థగోష్టి నిర్వహిస్తారు. 20న ఆరాధన హోమాలు, చందన రూపంతో నిత్యరూప దర్శనం, సాయంత్రం 5 గంటలకు శ్రీవారి చక్రస్నానం, చోరోత్సవం నిర్వహిస్తారు. 21 ఉదయం 10 గంటల నుంచి శ్రీవారి ప్రసాదం, అన్నసమారాధన, సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం, ద్వాదశారాధనలు, మహాపూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తి అవుతాయి.


ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ ధర్మకర్తలు

ఘనంగా కోటిగోటి తలంబ్రాల పూజ

సీటీఆర్‌ఐ: లోక కల్యాణార్థం చేపట్టే కోటి గోటి తలంబ్రాల దీక్షలో భాగంగా కోటిగోటి తలంబ్రాల యజ్ఞం కమిటీ అధ్యక్షుడు కల్యాణం అప్పారావు ఆధ్వర్యంలో గురువారం పుష్కరాల రేవులో అయోధ్య రామయ్యకు కోటి శుభలేఖల యజ్ఞం, విశ్వశాంతి హోమం, విశేష పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శ్రీరామ తత్వాన్ని ప్రచారం చేయడంలో భాగంగా 13 ఏళ్లుగా భద్రాచలం శ్రీరాముడికి, ఏడేళ్లుగా ఒంటిమిట్ట రామయ్యకు, రెండేళ్లుగా అయోధ్య సీతారామచంద్రునికి కోటిగోటి తలంబ్రాలు సమర్పిస్తున్నామన్నారు. ఈ ఏడాదీ సమర్పణలో భాగంగా పుష్కర ఘాట్ వద్ద కోటి తలంబ్రాలకు విశ్వశాంతి హారతి, కోటి ఒత్తులకు సీతారామ అష్టోత్తర శతనామ పూజ, అయోధ్య రామయ్య కోటి శుభలేఖలు యజ్ఞం కార్యక్రమం నిర్వహించి, శుభలేఖలకు కూడా శాంతి హారతి జరిపామన్నారు. గోకవరం మండలం అచ్యుతాపురంలో ప్రత్యేకంగా పండించిన పంట ఎనిమిది వందల కేజీలను ఐదు రాష్ట్రాలకు చెందిన 6,000 మంది భక్తుల గోటితో ఒలిచిన కోటి తలంబ్రాల యజ్ఞం జరుగుతోందన్నారు.


కోటిగోటి తలంబ్రాలతో పూజలో పాల్గొన్న అప్పారావు

ఎముకల సాంద్రత నిర్ధారణ పరీక్షలు

రాజమహేంద్రవరం సిటీ: మానవత స్వచ్ఛంద సేవాసంస్థ, కేఎస్‌ఆర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఎముకల సాంద్రత నిర్ధారణ పరీక్షలకు ప్రజలు విశేషంగా తరలివచ్చారని కేఎస్‌ఆర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ కొమ్మ ఉజ్వల్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు బూరగడ్డ మురళీ, కోశాధికారి పి.కృష్ణ ప్రసాదరెడ్డి తెలిపారు. స్థానిక కంభం సత్రం సమీపంలోని కేఎస్‌ఆర్ ఆసుపత్రిలో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ నిర్వహించిన ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ కొమ్మ సుస్మిత రోగులను పరీక్షించారు. ఆమె మాట్లాడుతూ విటమిన్ డి లోపం వల్ల కలిగే నష్టాలను వివరించారు. మొలకెత్తిన గింజలు, ఆకు కూరలు, పాలు, పండ్లను ఎక్కువగా తీసుకోవాలని, ప్రతి రోజూ కనీసం 15 నిమిషాలు సూర్యరశ్మి తగిలేలా చూసుకోవాలని సూచించారు. సుమారు 200 మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ డాక్టర్ కొమ్మా శ్రీనివాసరావు, మానవత సేవాసంస్థ సభ్యులు మంగరాజు, కేఎస్ఎన్ మూర్తి, శ్రీరామమూర్తి, రాజ్యలక్ష్మి, రుద్రమదేవి తదితరులు పాల్గొన్నారు.


శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా శ్రీదేవీ గౌరీ శంకరుల రథోత్సవం

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో గురువారం శ్రీదేవీ గౌరీ శంకరుల రథోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని చెరువు గట్టుపై కొలువుదీరిన గౌరీ శంకరుల ఆలయంలో ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ సతీ సమేతంగా తరలివచ్చి, గౌరీదేవికి చీర, సారె సమర్పించారు. వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ నూతనంగా తయారు చేసిన రథాన్ని ఆయన ప్రారంభించారు. ఈ రథోత్సవంలో వేలమంది మహిళలు పాల్గొన్నారు. సారెతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. స్థానిక కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చెరువు గట్టు నుంచి బయలుదేరి రామాలయం, బీసీ కాలనీ, పాత వీధి, పందుళ్లమ్మ గుడి, బస్టాండ్ సెంటర్, మోదకొండమ్మ సెంటర్ మీదుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ముక్కువారి చెరువులో నిమజ్జనం నిర్వహించారు. కార్యక్రమంలో కేఆర్‌జే రాజేష్, ఉత్సవ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


కార్యక్రమానికి హాజరైన పూర్వ విద్యార్థులు

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడు గ్రామంలోని మన్యం సూరయ్య జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1976 – 1981 బ్యాచ్ విద్యార్థులు గురువారం స్థానిక జేఎన్ రోడ్డులోని ఆర్‌కే రెసిడెన్స్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. సుమారు 45 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారందరూ చిన్ననాటి ముచ్చట్లను గుర్తుతెచ్చుకుని సందడి చేశారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి పరిచయ కార్యక్రమం నిర్వహించారు. భవిష్యత్తులో చేయాల్సిన పనులు, ఆర్థికంగా వెనుకబడిన వారికి సాయం చేయడం, స్కూల్ అభివృద్ధికి చేయూతనివ్వాలని తీర్మానించారు. ఆటపాటలతో సందడి చేశారు. అమెరికా వచ్చిన దాసరి పాపారావు చౌదరి మాట్లాడుతూ 40 ఏళ్ల తర్వాత చిన్ననాటి స్నేహితులను కలవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన చిట్టూరి రంగారావు, పోలిన కృష్ణ, కొత్తపల్లి శ్రీహరి చౌదరి, భోగవల్లి పద్మను అభినందించారు. రంగారావు మాట్లాడుతూ ఆత్మీయ కలయికకు వచ్చిన స్నేహితులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే వాసు విమర్శలు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో జరుగుతున్న అభివృద్ధిని చేసి ఓర్వలేకే టీడీపీ నాయకుడు ఆదిరెడ్డి వాసు లేనిపోని విమర్శలు చేస్తున్నారని, ధైర్యముంటే ఆ అవినీతి నిరూపించాలని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి సవాల్ విసిరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేసిన అభివృద్ధి పనుల్లో ఎక్కడైనా అవినీతి జరిగినట్లు అనిపిస్తే నిరూపించాలని డిమాండ్ చేశారు. జరిగిన అభివృద్ధిపై తాము బహిరంగ విచారణకు సిద్ధం అన్నారు. ఎంపీ భరత్‌రామ్‌పై అవినీతి బురద జల్లడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. కమీషన్లు తీసుకున్నారంటూ పోస్టర్లు ముద్రించి, వాటిని ముసుగులు వేసుకుని ప్రజలకు పంపిణీ చేయడం వాసు పిరికితనానికి నిదర్శనమన్నారు. పేదలకు ఫస్ట్ ఫేజ్‌లో 4,500, సెకండ్ ఫేజ్‌లో 3,600 పట్టాలిచ్చామని వాటిలో 80 శాతం ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయన్నారు. నగరంలో ఎంపీ భరత్‌రామ్ చేస్తున్న అభివృద్ధిపై బురద చల్లడం మాని, సిటీ ఎమ్మెల్యే భవాని ఎక్కడున్నారో ఆదిరెడ్డి వాసు చెప్పాలని డిమాండ్ చేశారు.


విలేకరులతో మాట్లాడుతున్న అడపా శ్రీహరి

పేదల సొంతింటి కల సాకారం

రాజానగరం: పేదల సొంతింటి కలను సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదేనని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని తోకాడ, నరేంద్రపురం జగనన్న కాలనీలలో గురువారం జరిగిన గృహ ప్రవేశాలకు హాజరైన ఎమ్మెల్యే కొద్దిసేపు లబ్ధిదారులతో మాట్లాడారు. నిలువ నీడ లేక అవస్థలు పడుతున్న పేదల గురించి తన సుదీర్ఘ పాదయాత్ర ద్వారా స్వయంగా తెలుసుకున్న జగనన్న, అధికారంలోకి రాగానే పేదోడి సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో రాష్ట్రంలో ఒకేసారి 31 లక్షల మందికి నివాస స్థలాలను అందించారన్నారు. ఆయా స్థలాలలో పక్కా గృహాలు కట్టుకునేలా ఆర్థిక సాయాన్ని అందిస్తూ, కొత్త గ్రామాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. అటువంటి నేతను ఏనాడు మరువరాదని, రాబోయే ఎన్నికలలో ఆయనకు ఓటు వేయడం తమ కర్తవ్యంగా ప్రతి ఒక్కరూ భావించాలన్నారు.

కంప్యూటర్ డిజిటల్ మేళా


పందలపాకలో ధ్రువపత్రాలు అందుకున్న విద్యార్థులతో గొలుగూరి నాగిరెడ్డి తదితరులు

బిక్కవోలు: మండలంలోని పందలపాక శ్రీపడాల పెద్ద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ప్రథమ ఇన్ఫోటెక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంప్యూటర్ డిజిటల్ మేళా కార్యక్రమాన్ని పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు గొలుగూరి నాగిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డిలు ప్రారంభించారు. అనంతరం వారిద్దరూ పాఠశాల విద్యార్థులు రూపొందించిన వివిధ ప్రాజెక్టులకు పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలోని పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి, పాఠశాల కంప్యూటర్ ఉపాధ్యాయులు డి.సత్యనాగదేవి, కె.బిందుమాధవి, పీడీ దార్వంపూడి యువరాజారెడ్డి, కర్రి సతీష్ తదితరులు పాల్గొన్నారు. తొస్సిపూడి ప్రాథమిక పాఠశాల వద్ద నిర్వహించిన కంప్యూటర్ డిజిటల్ మేళాలో వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు నల్లమిల్లి త్రినాథ్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం లచ్చిరెడ్డి సత్యనారాయణ, ప్రథమ ఇన్ఫోటెక్ రాష్ట్ర ప్రతినిధి జి.లోకరాజు పాల్గొన్నారు.

అభివృద్ధికి చిరునామాగా రాజానగరం

- నియోజకవర్గంలో ప్రగతి పరుగులు
- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు


ఫరిజల్లిపేటలో ఓహెచ్‌ఆర్ ప్రారంభించి, తాగునీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: అభివృద్ధి అంటే రాజానగరాన్ని చూడాలనే రీతిలో నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో ముందుకు నడిపిస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలో ఫరిజల్లిపేట, కానవరం, తోకాడ, రాజానగరం, పాత వెలుగుబంద, నరేంద్రపురం, నందరాడ తదితర గ్రామాలలో గురువారం ఆయన పర్యటించి, పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. తన తండ్రి, దివంగత మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు హయాంలో జరిగిన అభివృద్ధి మినహా ఆ తరువాత ఎవ్వరూ నియోజకవర్గ ప్రగతిని పట్టించుకోలేదన్నారు. తాను ఎమ్మెల్యే అయిన తరువాత గడచిన నాలుగున్నరేళ్లలో ఈ నియోజకవర్గంలో రూ.1,158 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడమే కాకుండా మరో రూ.1,146 కోట్లు వివిధ సంక్షేమ పథకాల ద్వారా పేదలకు అందించామన్నారు. రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ దివంగత మంత్రి జక్కంపూడి రామ్మోహనరావుతో కలిసి తాను కూడా పయనించానన్నారు. ప్రజల సంక్షేమం, నియోజకవర్గ ప్రగతికి ఆయన చూపే చొరవే రాజాలోనూ కనిపిస్తోందన్నారు. గతంలో ఎవ్వరూ చేయనంతగా అభివృద్ధి పనులను చేపట్టి, నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీసుకువచ్చారన్నారు.

ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

ఫరిజల్లిపేటలో రూ.63 లక్షలతో నిర్మించిన ఓహెచ్‌ఆర్, కానవరంలో రూ.99 లక్షలతో జలజీవన్ మిషన్ పథకంలో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్, కానవరంలో గ్రావెల్ రోడ్డు, తోకాడలోని జగనన్న కాలనీలో రూ.78.5 లక్షలతో ఏర్పాటు చేసిన బోరు, పైపులైన్లు, రూ.20 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాలు, మరో రూ. 20 లక్షల రుడా సహకారంతో ఏర్పాటు చేసిన జిమ్‌ను ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రారంభించారు. ఫరిజల్లిపేటలో చాగల్నాడు కాలువపై రూ.20 లక్షలతో నిర్మించే వంతెనకు, తోకాడలో జలజీవన్ మిషన్ ద్వారా రూ.78.54 లక్షలతో నిర్మించే ఓవర్ హెడ్ ట్యాంకు, మరో రూ.50 లక్షలతో చేపట్టే చెరువు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, కో కన్వీనర్ గండి నానిబాబు, మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు, నాయకులు ఉండమట్ల రాజబాబు, గంగిశెట్టి సోమేశ్వరరావు, అనదాస సాయిరామ్, వేమగిరి కృష్ణ, సంగీత సత్తిబాబు, శ్రీరామకృష్ణ, కోడి రాఘవ, వీర వెంకట్రావు, వెంకటేశ్వరరావు, నీలపాల శివ, సంగీత శ్రీను, దుర్గారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: వార్షిక మరమ్మతుల నేపథ్యంలో కాటన్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఎర్రకొండ, రాజవోలు ఫీడర్ల పరిధిలోని బొమ్మూరు, రాజవోలు, ఏఎంజీ ఏరియా, రమాదేవి గార్డెన్, గాయత్రీ నగర్, శ్రీయ గార్డెన్, ప్రశాంతి నగర్, ఎంఆర్ ఆఫీస్, ఇందిరమ్మ కాలనీ, వడ్డీ వీరభద్రనగర్, పాత బొమ్మూరు, కొత్తపేట ఏరియాలలో సరఫరా ఉండదన్నారు.

కడియం: కడియపులంక లోకల్ ఫీడర్ల పరిధిలోని కడియపులంక, బుర్రిలంక, వెంకాయమ్మపేట, దోసాలమ్మ కాలనీలకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని ఆ శాఖ ఈఈ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. వార్షిక మరమ్మతుల్లో భాగంగా ఈ అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎంపీడీవో రత్నకుమారి సేవలు ప్రశంసనీయం


బదిలీపై వెళుతున్న ఎంపీడీవో రత్నకుమారిని సత్కరిస్తున్న నాయకులు

కడియం: ఎంపీడీవోగా కె.రత్నకుమారి సేవలు ప్రశంసనీయమని పలువురు నాయకులు కొనియాడారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జరిగిన సాధారణ బదిలీల్లో రత్నకుమారి కృష్ణాజిల్లాకు వెళ్లారు. ఈ సందర్భంగా రత్నకుమారికి గురువారం ఘన సత్కారంతో వీడ్కోలు పలికారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీతో పాటు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు, మాధవరాయుడుపాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కలిదిండి విశాలాక్షి, ఎంపీడీవో డి.రాజ్ మనోజ్ తదితరులు పూలమాలలు, సాలువలతో ఘనంగా సత్కరించారు. అలాగే కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో డి.రాజ్ మనోజ్, ఈవోపీఆర్డీ విక్టర్ బాబులను ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ లజపతిరాయ్, జేఈ పీహెచ్ త్రిమూర్తులు, ఏవో ద్వారకాదేవి, హెచ్‌వో సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

కడియం: వేమగిరి వద్ద ఒక నర్సరీ సమీపంలో పేకాడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.20,100, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్టు ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. ఎస్‌ఐ టి.కృష్ణసాయి, సిబ్బంది ఈ దాడిలో పాల్గొన్నారన్నారు.

వ్యక్తి అదృశ్యం


యర్రా శ్రీనివాస్ (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: ఇంటి నుంచి వెళ్లిన తన భర్త తిరిగి రాలేదని కవలగొయ్యి గ్రామానికి యర్రా దుర్గ గురువారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె భర్త యర్రా శ్రీనివాస్ (42) ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడికి మతిస్థిమితం సరిగ్గా లేదు. గత ఏడాది నవంబర్ 25న విజయవాడ వెళ్తున్నానని అని చెప్పి వెళ్లిన శ్రీనివాస్ తిరిగి రాలేదు. ఫోన్ చేసినా స్పందించకపోవడంతో బంధువులు, స్నేహితులు, రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలలో వెతికారు. అయినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు.

టీడీపీ, జనసేన నాయకుల నిరసన

రాజమహేంద్రవరం సిటీ: నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట టీడీపీ, జనసేన నాయకులు గురువారం నిరసన తెలిపారు. ఆదిరెడ్డి వాసు, అత్తి సత్యనారాయణ మాట్లాడుతూ పేదలకు ఇళ్లు, స్థలాలు మంజూరు చేయాలన్నారు. అనంతరం అసిస్టెంట్ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు.

ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలి

సీతానగరం: మండలంలో జరిగే ఉపాధి హామీ పథకం పనులకు కూలీల సంఖ్య పెంచాలని డ్వామా పీడీ ఎ.ముఖలింగం సూచించారు. ఏపీడీ బి.రామ్‌ప్రసాద్, ఏపీవో కె.నాగ శేషవేణితో కలిసి గురువారం ముగ్గళ్లలో జరుగుతున్న పంటబోదె పూడికతీత పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడి ఎంత కూలి వస్తోందని అడిగి తెలుసుకున్నారు. రూ.272 వచ్చేలా పనులు చేయాలని, ప్రతి కుటుంబం వంద రోజులు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఏపీవో నాగ శేషవేణి మాట్లాడుతూ మండలంలో జరిగే ఉపాధి పనులకు 400 మంది కూలీలు వస్తున్నారని తెలిపారు. పీడీ మాట్లాడుతూ వెయ్యి మంది కూలీలు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. వంద రోజులు పూర్తి చేసిన కుటుంబాల సంఖ్యలను వచ్చే నెలాఖరుకు 1,500 వరకూ పెంచాలన్నారు. 2024 – 25కు పనులు గుర్తించి ఆమోదం పొందాలన్నారు.

సినిమాలు



శ్యామల	ఊరుపేరు భైరవకోన
సూర్యమినీ	మేడమ్ వెబ్
సూర్యప్యాలెస్	ఊరుపేరు భైరవకోన
స్వామి	ఈగల్
శివజ్యోతి	అంబాజీపేట మ్యారేజీ బ్యాండు
అనుశ్రీ	హనుమాన్
రాజా	ఊరుపేరు భైరవకోన
ఊర్వశి	యాత్ర–2
రంభ	లాల్‌సలామ్
మేనక	సూర్య సన్ ఆఫ్ కృష్ణన్, డ్రిల్
అప్సర	గుంటూరుకారం
కుమారి	ట్రూలవర్
నామవరం	
వీఎస్ మహల్	ఊరుపేరు భైరవకోన
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	ఊరుపేరు భైరవకోన
కడియం	
వెంకటసూర్య	ఊరుపేరు భైరవకోన